
7లో

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





జడ్పీ సమావేశానికి హాజరైన చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు, సునితారెడ్డి, సంజీవరెడ్డి, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

అభివృద్ధి పనుల రద్దు సరికాదు

గత ప్రభుత్వం మంజూరు చేసినవాటిని కొనసాగించాలి



సంగారెడ్డి కలెక్టర్ క్రాంతిని సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీరెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి

- సంగారెడ్డి జడ్పీ మీటింగ్‌లో సభ్యుల డిమాండ్
- పనులను రద్దు చేయడంపై ఆగ్రహం
- సీఎస్‌ఆర్ నిధులపై సభ్యుల వాగ్వాదం
- ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఆగ్రహం
- తొమ్మిది శాఖలపై చర్చతోనే సరి

సంగారెడ్డి టౌన్, జనవరి 8 : సంగారెడ్డి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం వాడీవేడిగా జరిగింది. గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను నిలిపివేస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాలివ్వడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘనతో పాటు సీఎస్‌ఆర్ నిధులపై చర్చ జరిగింది. సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ మంజుశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సునితారెడ్డి, సంజీవరెడ్డి, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన జడ్పీ సమావేశం పలువురు ప్రజా ప్రతినిధులు సకాలంలో రాకపోవడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైంది. సమావేశం ఎజెండాలో మొత్తం 54 అంశాలను పొందుపర్చగా కేవలం 9 శాఖలపై మాత్రమే చర్చ జరిగింది. ప్రధాన శాఖలైన వ్యవసాయం, జిల్లా పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి, వైద్య-ఆరోగ్యం, విద్య, పంచాయతీరాజ్, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పశుసంవర్ధకశాఖలపై చర్చించారు.

సీఎస్‌ఆర్ నిధులను పక్క జిల్లాలకు తరలించారని ఆరోపణ

జిల్లాలోని పలు పరిశ్రమల ద్వారా వచ్చే సీఎస్‌ఆర్ నిధుల కేటాయింపుపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ జడ్పీటీసీల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. కొండాపూర్ మండలంలోని పలు బీరు కంపెనీల నుంచి సీఎస్‌ఆర్ నిధులను గత పాలకులు సిద్దిపేట, సిరిసిల్ల ప్రాంతాలకు తరలించారని కొండాపూర్ ఎంపీపీ మనోజ్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై జడ్పీ వైస్‌చైర్మన్ కుంచాల ప్రభాకర్, ఎంపీపీ సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు ప్రశ్నించకుండా- ఇప్పుడు పార్టీ మారగానే విమర్శించడం ఏమిటని ఎదురుదాడికి దిగారు. అనంతరం కోహీర్ జడ్పీటీసీ రాందాస్ మాట్లాడుతూ తమ మండలంలోని పిరమిడ్ పరిశ్రమ యాజమాన్యం జిల్లా కలెక్టర్ ఆదేశాలను ఖాతరు చేయకుండా సీఎస్ఆర్ నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేసిందని ఫిర్యాదు చేశారు.

అభివృద్ధికి ఆటంకం

గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను నిలిపివేయాలని ఆదేశాలివ్వడం సరికాదని ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణికర్‌రావు, సునీతారెడ్డిలతో పాటు పలువురు జడ్పీటీసీలు మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలంగా మార్చేందుకు రూ.4,500 కోట్లతో గత ప్రభుత్వం ప్రారంభించిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను నిలిపివేస్తే రైతులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్, పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ తదితర పనులను రద్దు చేయకుండా కొనసాగించాలని జడ్పీటీసీలు ఏకగ్రీవంగా తీర్మానించారు. జహీరాబాద్‌లోని ట్రైడెంట్ షుగర్ పరిశ్రమ నుంచి చెరకు రైతులకు రావాల్సిన రూ.7.35 కోట్ల బకాయిలను వెంటనే ఇప్పించాలని స్థానిక ఎమ్మెల్యే మాణిక్‌రావు కలెక్టర్‌ను కోరారు. అలాగే, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. అభివృద్ధి పనుల్లో అందరినీ భాగస్వాములను చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

కర్ణాటక కాంట్రాక్టర్లతో రోడ్ల పనులు

నాగల్‌గిద్ద రోడ్డు మరమ్మతులు ఎందుకు చేయడం లేదని జడ్పీటీసీ రాజు రాథోడ్ సంబంధిత శాఖ అధికారులను ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ రాంబాబు స్పందిస్తూ జిల్లాలో చేపట్టిన ఆర్‌అండ్‌బీ పనులను చేసేందుకు తెలంగాణ కాంట్రాక్టర్లు ముందుకురాకపోవడంతో కర్ణాటకకు చెందిన కాంట్రాక్టర్లను పిలిపించి పనులు చేయించాల్సి వస్తున్నదని తెలపడంతో సభ్యులు, ఎమ్మెల్యేలు, అధికారులు నిర్ఘాంతపోయారు. ఆయా పనులకు సంబంధించి అనేకసార్లు టెండర్లు పిలిచినా ఈ ప్రాంత కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాయికోడ్, మునిపల్లి, తదితర మండలాల్లో రోడ్లు, కల్వర్టుల నిర్మాణం పనులను సైతం కర్ణాటక కాంట్రాక్టర్ల చేత పనులు చేయిస్తున్నామన్నారు. కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ పెద్ద చెరువు మరమ్మతు కోసం రూ.7 కోట్లు మంజూరైనా ఇప్పటివరకు కనీసం అగ్రిమెంట్ కూడా చేయకపోవడం ఏమిటని ఎంపీపీ మనోజ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. అందోలు మండలం అక్సాన్‌పల్లి చెరువు, మొల్లోనికుంట కట్టలు బీటలువారి ప్రమాదకరంగా మారినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని అందోలు జడ్పీటీసీ రమేశ్ ఆరోపించారు.

అసైన్డ్ భూముల కబ్జాపై విచారణ

నారాయణఖేడ్ నియోజకవర్గంలో వేలాది ఎకరాల అసైన్డ్ భూములు కబ్జాకు గురయ్యాయని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. అన్యాక్రాంతమైన భూములపై విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. గతంలో చాలామంది పేదలకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూమిని కొంతమంది అక్రమంగా కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు. గుమ్మడిదల జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తమ మండలంలో పేదలకు అసైన్డ్ భూములను కేటాయించి పట్టాలిచ్చినా పొజిషన్ చూపటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. అభివృద్ధి పనుల కొనసాగింపు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో కీలకమైన నీటి సరఫరా, పారిశుధ్యం సజావుగా సాగేలా చూడాలన్నారు. తమదృష్టికి వచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా అధికారులు నర్సింహారావు, శ్రీనివాసరావు, వసంతకుమారి, విజయలక్ష్మి, సురేష్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగం.. ప్రహసనం

- ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు భారంగా ప్రాక్టికల్స్ నిర్వహణ
- మూడేళ్లుగా నిధులు విడుదల చేయని సర్కారు
- ఫిబ్రవరి 1 నుంచే ఇంటర్ ప్రయోగ పరీక్షలు
- మెదక్ జిల్లాలో 3,720 మంది విద్యార్థులు

మెదక్ అర్బన్, జనవరి 8: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలను వచ్చే నెల 1 నుంచే నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించింది. జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ 3,720 మంది ద్వితీయ సంవత్సర, ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగాల నిర్వహణకు అవసరమైన రసాయనాలు లేకపోవడం అధ్యాపకులను, విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నది. మూడేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో ప్రాక్టికల్స్ నిర్వహణ భారంగా మారింది. ఫిబ్రవరి చివర్లోనే వార్షిక పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో నిధుల్లేక ప్రభుత్వ కళాశాలల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రాక్టికల్స్‌కు కావాల్సిన పరికరాలు, కెమికల్స్, ఇతరత్రా సామగ్రికి సర్కారు నిధులివ్వడం లేదు. విద్యార్థులతో ముందుగానే సాధన చేయించాల్సిన అధ్యాపకులు పరీక్షలప్పుడే ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాఠాలను ప్రయోగపూర్వకంగా వివరిస్తే పూర్తి స్థాయిలో అవగాహన కలుగుతుంది.

పాత పరికరాలు, రసాయనాలే దిక్కు

ఇంటర్ విద్యార్థులకు కీలకమైన ప్రాక్టికల్స్ నిర్వహణకు ఏటా ఆయా సర్కార్ నిధులు విడుదల చేయకపోవడంతో అరకొర వసతులు, ల్యాబ్‌లో తుప్పుపట్టిన పరికరాలతోనే విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎలాంటి పరికరాలు, రసాయనాలు కొనుగోలు చేయలేదు. పాత వాటితోనే ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్ విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. దాంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ఏటా ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో పోలిస్తే.. ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో తక్కువ మార్కులను సాధిస్తున్నారు. వీటి ప్రభావం ఎంసెట్ ర్యాంకులపై పడుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కళాశాల నిర్వహణ ఖర్చుల కింద నిధులు విడుదల



కరోనా కంటే ముందు ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రయోగాలకు అవసరమయ్యే రసాయనాలను అందజేసింది. అనంతరం మూడేళ్లుగా నిధులను విడుదల చేయడం లేదు. రెండు రోజుల కింద ప్రభుత్వం కాలేజీ మెయింటనెన్స్ ఖర్చుల కింద ఒక్కో విద్యార్థికి రూ.38 చొప్పున రూ.1,50,860 నిధులను విడుదల చేసింది. కళాశాల నిర్వహణకు విడుదల చేసిన నిధులను ఆయా కళాశాలల ఖాతాల్లో జమ చేస్తాం.

-సత్యనారాయణ, ఇంటర్ నోడల్ అధికారి, మెదక్



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

యాసంగి వరి సాగుకు

సింగూరు జలాల విడుదల

- రోజుకు 150 క్యూసెక్కుల చొప్పున సీజన్ అంతా కొనసాగింపు
- ప్రాజెక్టులో ప్రస్తుతం 24.954 టీఎంసీల నీరు



సింగూరు ఎడమ కాల్వలోకి వదిలిన జలాలు

పుల్‌కల్, జనవరి 8: సింగూరు ప్రాజెక్టు ఆయకట్టు పరిరక్షణకు పుల్కల్, అందోలు మండలాల పరిధిలో యాసంగి సీజన్ వరి పంట సాగుకు నీటి పారుదలశాఖ అధికారులు సోమవారం జలాలను విడుదల చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. రోజుకు 150 క్యూసెక్కుల చొప్పున యాసంగి సీజన్ వరి నాట్లు అనంతరం పంట కోతకు వచ్చేంత వరకు సింగూరు జలాల విడుదల కొనసాగుతుందన్నారు. నాలుగు నెలల పాటు మొత్తం 2 టీఎంసీల సింగూరు జలాలు ఎడమ ప్రధాన కాల్వ తూముల గుండా నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రాజెక్టులో ఆశించినస్థాయిలో జలాలు అందుబాటులో ఉన్నాయని, ఎత్తిపోతలతో సంబంధం లేకుండానే కేవలం గ్రావిటీ ద్వారా నీటి విడుదల ఉంటుందన్నారు. ప్రాజెక్టులో సోమవారం నాటికి నీటి నిల్వలు 24 టీఎంసీలు ఉన్నాయి. హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరాకు 80 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 220 క్యూసెక్కులు ఆవిరి అవుతున్నాయి. తాగు, సాగు నీటికి ఎలాంటి ఢోకా లేదని, ప్రస్తుతం ప్రాజెక్టులో సమృద్ధిగా జల వనరులు అందుబాటులో ఉన్నాయని ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. రైతులు వరి నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్న సమయంలో సింగూరు జలాలను విడుదల చేయడంపై పుల్కల్, చౌటకూర్ మండలాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ఎందుర్గారెడ్డి, నత్తి దశరత్ మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వైస్ చైర్మన్ నయీమొద్దీన్‌కే

నర్సాపూర్ మున్సిపల్ ఇన్‌చార్జి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న నయీమొద్దీన్

నర్సాపూర్, జనవరి 8: నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్ సోమవారం ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్‌పై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడంతో ఆయన నాలుగు రోజుల క్రితవ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను జిల్లా కలెక్టర్ ఆమోదించారు. వైస్ చైర్మన్ నయీమొద్దీన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను కమిషనర్ వెంకట్‌గోపాల్ అందజేశారు. అనంతరం ఆయనను మురళీధర్‌యాదవ్‌తో పాటు బీజేపీ కౌన్సిలర్లు సురేష్, రాజేందర్, బుచ్చేస్, యాదగిరి, లతారమేష్‌యాదవ్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, రామచందర్, సునీతాబాల్‌రెడ్డి, లలితభిక్షపతితో పాటు నాయకులు సింగాయపల్లిగోపి, శేఖర్, భిక్షపతి, నగేష్, ఆంజనేయులుగౌడ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఎగ్జిబిట్‌ను పరిశీలించి విద్యార్థినిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఆసక్తితో చదివితే విజయం మీ సొంతం

ప్రతీ సబ్జెక్టుపై పట్టు సాధించాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

సంగారెడ్డి అర్బన్, జనవరి 8 : విద్యార్థులు ఆసక్తితో చదివితే విజయం సొంతమవుతుందని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను సోమవారం ఆమె ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను ఆసక్తితో పరిశీలించి విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులను అభినందించారు. పాఠశాల స్థాయిలో తాను ప్రదర్శించిన ఎగ్జిబిట్లను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సబ్జెక్టుపై పట్టు సాధించినప్పుడే ప్రతిభ చాటగలరని తెలిపారు. చదువుపై ఆసక్తి పెంచుకోవాలని, ప్రతీ విషయాన్ని తెలుసుకోవాలనే తపన, ఆకాంక్ష ఉండాలని సూచించారు. విద్యార్థులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని గమనిస్తూ వాటిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిట్లను వారు ఆసక్తిగా తిలకించి అభినందించారు. కాగా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని రూ.10 కోట్లతో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ముందుకొచ్చిన ఎల్‌వైకె కంపెనీ(లాటిక్రేట్) ప్రతినిధులను కలెక్టర్ అభినందించి ఎంవోయూ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఈవో వెంకటేశ్వర్లు, ఏడీ శంకర్, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, మీడియా కన్వీనర్,హెచ్‌ఎం జాకీర్‌హుస్సేన్, ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాల యాజమాన్యం సల్మోన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రుద్రారం సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శ గ్రామం నమూనాతో విద్యార్థిని షారోన్‌రోసి, ఉపాధ్యాయులు

అన్ని సౌకర్యాలుంటేనే ఆదర్శ గ్రామం

గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలుంటేనే గ్రామం ఆదర్శంగా నిలుస్తుంది. మహాత్ముడు కలలుకన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుంది. ఇల్లు, పల్లె, తద్వారా రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడమే లక్ష్యమని తెలిపేలా కొండాపూర్ మండలం, సైదాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని షారోన్‌రోసి ప్రదర్శించిన ఎగ్జిబిట్ చూపరులను ఆకర్షించింది.

కొమురవెల్లి భక్తిపారవశ్యం

- మల్లన్నకు కనులపండువగా లక్ష బిల్వార్చన
- భక్తిప్రపత్తులతో ఏకాదశ రుద్రాభిషేకం
- కొనసాగుతున్న భక్తుల రద్దీ
- బుకింగ్ ఆదాయం రూ.22 లక్షలు

చేర్యాల, జనవరి 8 : కొమురవెల్లి మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వైభవంగా లక్షబిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆదివారం ఆలయ తోటబావి ఆవరణలో నిర్వహించిన స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన విషయం విదితమే. ఉత్సవాలలో భాగంగా రెండో రోజున మల్లన్నకు సుప్రభాతసేవ, గణపతి పూజ, శివపుణ్యాహవాచనం, నాందిసమారాధన, గురుపంచ కలశస్థాపన, నవగ్రహ ఏకాదశరుద్ర సప్తమాతృకాత్రిమూర్తి, త్రిమాత, అష్టదిక్పాలక నిత్యార్చన, ప్రధాన కలశస్థాపన, ఆవాహన అర్చనను నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవరుత్విక్కులు స్వామివారికి శాస్త్రోక్తంగా బిల్వార్చన జరిపారు. భక్తిప్రపత్తులతో ఏకాదశ రుద్రాభిషేకం పూజలు చేశారు. వీరశైవాగమ వేదపాఠశాల విద్యార్థులు మల్లన్నను స్తుతిస్తూ చేసిన మంత్రోచ్చారణలతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. మల్లన్నను దర్శించుకునే భక్తుల రద్దీ కొనసాగుతున్నది. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీశర్మ, ఏఈవోలు వైరాగ్యం అంజయ్య, గంగ శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చక సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, అర్చకులు పడిగన్నగారి మల్లికార్జున్, మహదేవుని సాంబయ్య, ఆకుల విజయ్‌కుమార్, మహదేవుని మనోహర్, మహదేవుని రవి, మహదేవుని భాస్కర్, ఉద్యోగులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వీరశైవార్చకులు

రూ.9 లక్షల మేర పెరిగిన ఆదాయం

మల్లన్న కల్యాణం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్న క్రమంలో సుమారు రూ.22 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. తలనీలాల సమర్పణ, ఆర్జితసేవలు, పట్నాలు, బోనాలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె, ప్రసాద విక్రయాల ద్వారా శనివారం రోజున రూ.1.50 లక్షలు, ఆదివారం రోజున రూ.18.70 లక్షలు, సోమవారం సుమారు రూ.2లక్షలు చొప్పున మొత్తం రూ.22 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. గతేడాది మూడు రోజుల్లో రూ.13లక్షల బుకింగ్ ఆదాయం సమకూరగా, ఈ ఏడాది రూ.9 లక్షలు మేర ఆదాయం పెరిగింది.



బిళ్వాలతో మల్లన్న

నూతన ఉత్సవమూర్తులకు సంప్రోక్షణ

ఆర్జిత సేవలు, పూజల నిర్వహణతో పాటు అలంకరణకు వీలుగా ఆలయ వర్గాలు ఇటీవల మల్లన్న, కేతల మ్మ, మేడలాదేవీ పంచలోహ నూతన ఉత్సవమూర్తులను తయారు చేయించారు. కల్యాణం సందర్భంగా ఆదివారం సంప్రోక్షణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

విద్యార్థిని మృతిపై ఆర్సీవో విచారణ

జహీరాబాద్, జనవరి 8: జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ గ్రామంలోని సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న బేగరి స్వప్న ఆదివారం ఆత్మహత్యకు పాల్పడగా ఆమె మృతిపై మెదక్ రీజీయన్ ఆర్సీవో భీమయ్య సోమవారం విచారణ చేపట్టారు. అందులో భాగంగా ఆయన కళాశాలకు చేరుకుని విద్యార్థిని మృతిపై ఆరాతీసి, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి సమాచారం సేకరించారు. సుమారు రెండుగంటల పాటు మృతిచెందిన విద్యార్థిని స్వప్నకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

కొత్తపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

పాపన్నపేట, జనవరి 8: కొత్తపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు. ఉప సర్పంచ్ అంజలి ఫిర్యాదు చేయగా, డీఎల్పీవో విచారణ జరిపి ఇచ్చిన రిపోర్టు ఆధారంగా చెక్ పవర్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉప సర్పంచు సంతకం లేకుండా, మరో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ సంతకం తీసుకుని నిధులు డ్రా చేశారని, గ్రామ సభలు సక్రమంగా నిర్వహించలేదని పేర్కొన్నారు. ఇక ముందు ఎంపీవో, ఉప సర్పంచ్ ఉమ్మడి సంతకాలతో నిధులు డ్రా చేయవచ్చని సూచించారు.

జాతీయ క్రీడలకు పీఈటీ ఎంపిక



రాములు యాదవ్‌కు పతకాలు, ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

కల్హేర్, జనవరి 8: మండల పరిధిలోని క్రిష్ణాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ రాములు యాదవ్ 6వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ గేమ్స్‌లో నాలుగు పతకాలు సాధించి, డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో శనివారం జరిగిన క్రీడల్లో లాంగ్‌జంప్, 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు, 100, 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకాలు సాధించాడు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాములు యాదవ్‌ను కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, క్రిష్ణాపూర్ సర్పంచ్ కిష్టారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రాంమోహన్‌రావ్ అభినందించారు.

అంతర్‌రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రథమ బహుమతి



ప్రథమ బహుమతి అందుకుంటున్న షటిల్ టోర్నీ విజేతలు

నారాయణఖేడ్,జనవరి 8: కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం మిషన్ కలాలి గ్రామంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన అంతర్‌రాష్ట్ర ఓపెన్ టూ ఆల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. మహారాష్ట్రలోని డెగ్లూరు టీంతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఖేడ్‌బుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులు రవిగౌడ్, ఖలీల్ ప్రథమ బహుమతిని సాధించారు. అసోసియేషన్‌కే చెందిన రెండో జట్టులోని రిత్విజ్, గంబీర్ సెమీఫైనల్స్‌లో ఓడినా రిత్విజ్ ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డును దక్కించుకున్నాడు. వారిని అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్‌సాజిద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్‌తో పాటు ఇతర బాధ్యులు భూమయ్య, ప్రవీణ్, మారుతి, దేవీసింగ్, తదితరులు అభినందించారు.

జిల్లాల పునర్విభజనతో లాభపడింది కేసీఆర్ కుటుంబమే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

మెదక్, జనవరి 8: కేసీఆర్ ప్రభుత్వం 33 జిల్లాలను ఏర్పాటు చేయడం ద్వారా వారి కుటుంబం మాత్రమే లబ్ధి పొందిందని, అశాస్త్రీయ పద్ధతిలో జిల్లాల పునర్విభజన చేయడంతో ప్రభుత్వంపై భారీగా ఆర్థిక భారం పడిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బాల్‌రాజ్ ఆరోపించారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మాట్లాడుతూ ప్రభుత్వాధికారులు వేతనాలు పొందుతూ సామాన్య, నిరుపేదలకు అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు అణగారిన వర్గాల పక్షాన నిలిచి సామాజిక న్యాయం దిశగా అడుగులు వేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 33 జిల్లాలను కుదించే దిశగా కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు రవి, సంజీవులు, సిద్దిరాములు, నర్సింలు, ప్రవీణ్, ప్రభాకర్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

బద్రుద్దీన్ | వెంకటేశ్వర్ రాజు

కోహీర్ జనవరి 8: టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం కోహీర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నామని ఆ కమిటీ జిల్లా కార్యదర్శి హైమద్ హసీబోద్దీన్ తెలిపారు. సోమవారం కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ ఆధ్వర్యంలో ఆ కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడిగా మొహమ్మద్ బద్రుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రాజు, ఉపాధ్యక్షులుగా ప్రసన్న, సయ్యద్ జహంగీర్, కోశాధికారిగా జనార్దన్, మండల కార్యదర్శులుగా రాము, రజియోద్దీన్, నందిని, పూజిత, పుష్పమ్మ ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బలరామ్, సభ్యులుగా హామెదబిన్ సయ్యద్, శంషాద్ బేగం, మీనాక్షి, ముకుంద్, శిల్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ఈసారైనా విద్యారంగాన్ని మెరుగుపరిచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అలాగే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ఇవ్వాలన్నారు.

ఒరిజినల్ గుర్తింపు కార్డులను చూపించాలి

జహీరాబాద్, జనవరి 8: మహాలక్ష్మీ పథకంలో భాగంగా బస్సుల్లో ప్రయాణించే ప్రతీ మహిళా ఒర్జినల్ గుర్తింపు కార్డులను వెంట తెచ్చుకోవాలని జహీరాబాద్ డిపో మేనేజర్ సూర్యనారాయణ తెలిపారు. మహిళలు గుర్తింపు కార్డులను మొబైల్‌ఫోన్‌లో ఉన్నాయంటూ కండక్టర్లకు చూయిస్తున్నారని, అందులో ఫొటో, వివరాలు స్పష్టంగా ఉండకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళాప్రయాణికులు ఒరిజినల్ గుర్తింపుకార్డులను చూయించి జీరోటికెట్ విధిగా తీసుకోవాలన్నారు. మహాలక్ష్మీ పథకం తెలంగాణ రాష్ట్ర మహిళలకే వర్తిస్తుందని, ఇతరత్ర రాష్ట్రాలకు చెందిన మహిళలు వర్తించదన్నారు.

ఆస్తి లాక్కుని.. అన్నం పెట్టడం లేదు

● ఆర్డీవోకు విన్నవించిన వృద్ధ దంపతులు

నారాయణఖేడ్, జనవరి 8: తమ పేరిట ఉన్న భూమిని నలుగురు కుమారులు వారి పేర్లపైకి మార్చుకుని పట్టెడన్నం పెట్టడం లేదని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఖేడ్ ఆర్డీవో వెంకటేష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం మాద్వార్ పోతన్‌పల్లి గ్రామానికి చెందిన దాడి బాగయ్యకు నలుగురు కుమారులు ఉన్నారు. తన పేరిట ఉన్న 8 ఎకరాల భూమిని నలుగురికి సమానంగా రాసి ఇచ్చాడు. అయితే భూమి రాయించుకున్న అనంతరం వృద్ధాప్యంలో ఉన్న తమకు కొడుకులు, కోడళ్లు అన్నం పెట్టడం లేదని వాపోయారు. అందువల్ల తమకు న్యాయం చేయాలని ఆ వృద్ధ దంపతులు ఆర్డీవోను కోరారు. దీంతో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వారికి హామీఇచ్చారు.


ఖేడ్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న వృద్ధ దంపతులు

మల్లన్న భక్తురాలి 10 తులాల బంగారు గొలుసు అపహరణ

చేర్యాల, జనవరి 8: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనార్థం వచ్చిన ఓ మహిళ మెడలో నుంచి పది తులాల బంగారం గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. హైదరాబాద్ కొంపల్లికి చెందిన ఆండాలు మల్లన్న కల్యాణం సందర్భంగా ఆదివారం కుటుంబసమేతంగా కొమురవెల్లికి చేరుకున్నారు. గంగిరేగుచెట్టు ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసు అపహరించడంతో ఆందోళనకు గురైంది. ఈ విషయమై సోమవారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ నాగరాజు దర్యాప్తు చేపట్టారు. ఆలయంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా.. ఆండాలును పలువురు మహిళలు చుట్టుముట్టి అనుమానాస్పదంగా కనిపించడాన్ని గుర్తించారు. ఇదిలా ఉండగా జాతర సమయంలో గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. భక్తులు చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేయడంతో పాటు ముడుపులు కట్టే క్రమంలో దొంగలు మహిళల ఆభరణాలు, పురుషుల పర్సులు అపహరిస్తున్నారు. కల్యాణం రోజునే పలువురి మహిళల బంగారు గొలుసులు కొట్టేయగా, మరో మూడునెలలపాటు ఉత్సవాలు జరగనున్నందున దొంగతనాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూమి విక్రయిస్తామని డబ్బులు తీసుకుని మోసం

● ముగ్గురిపై కేసు నమోదు

కల్హేర్, జనవరి 8: భూమి విక్రయిస్తామని చెప్పి రూ.20 లక్షలు బయానా తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసానికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం సోమవారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన వడిత్యా దిలీప్ కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన ముల్కి పేతురు అనే వ్యక్తికి చెందిన 68అ, 69అ1, 69/ఆ/2 సర్వే నంబర్లలోని 3 ఎకరాల రెండు గుంటల భూమిని రూ.36.60 లక్షలకు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు వడిత్యా దిలీప్ తన భార్య వడిత్యా దేవి పేరున 2023 మే 29న ఒప్పంద పత్రం రాయించుకుని రూ.20 లక్షలు అడ్వాన్స్ కింద పేతురుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు నాగ్‌ధర్‌కు చెందిన సుధాకర్, కంగ్టికి చెందిన శివకు అందజేశారు. భూమి రిజిష్ట్రేషన్ చేయాలని వడిత్యా దిలీప్ ఎన్నిసార్లు పేతురును కోరినా ఆయన రిజిష్ట్రేషన్ చేయలేదు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో ఈ ముగ్గురు వ్యక్తులు చెక్కులు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. డబ్బులు డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లగా వారి ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. దీంతో రూ.4.50 లక్షలు తిరిగిఇవ్వగా మిగతా రూ.15.50 లక్షలు ఇవ్వకుండా బాధితులను బెదిరించడంతో వారు 3న కల్హేర్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పేతురుతో పాటు ఆయనకు సహకరించిన సుధాకర్, శివపై 420, 406, 506 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

బయోమైనింగ్ చేసినా ఫలితమేదీ?

● గుట్టలుగా పేరుకుపోతున్న చెత్తకుప్ప
● తడి, పొడి చెత్తను వేరుచేయకుండానే డంపింగ్‌యార్డులో పారబోత
● అధికారుల పర్యవేక్షణా లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం


డంపింగ్‌యార్డులోని బయోమైనింగ్ మెషీన్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 8: రాష్ట్రవ్యాప్తంగా డంపింగ్‌యార్డులను శుభ్రం చేసేందుకు ప్రభుత్వం బయోమైనింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మెదక్ మున్సిపాలిటీలోనూ చేపట్టారు. 9 నెలలుగా ఈ ప్రాజెక్టులో భాగంగా గుట్టలుగుట్టలుగా పేరుకుపోయిన తడి, పొడి చెత్తను శుభ్రం చేసే పని ప్రారంభించారు. ఈ విధానం ద్వారా ప్లాస్టిక్, ఇతర వస్తువులను వేరుచేయడంతో పాటు తడి చెత్తను వర్మీకంపోస్ట్‌గా మారుస్తున్నారు. ఓవైపు డంపింగ్‌యార్డును పూర్తిగా జల్లెడ పడుతుంటే, మరోవైపు మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తడి, పొడి చెత్త గుట్టలు పేరుకుపోతున్నాయి. అసలు సిబ్బంది తడి, పొడి చెత్తను వేరుచేయకుండానే డంపింగ్‌యార్డులో పారబోస్తున్నారు.

మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 32 వార్డులు ఉండగా ప్రతీరోజు 20 టన్నుల వరకు తడి, పొడి చెత్త వస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపారు. ఇందులో తడి చెత్త 5 టన్నులు, పొడి చెత్త 10 టన్నులు, రెండూ కలిపి 2 టన్నులకుపైగా వస్తున్నది. అయితే ఇంటివద్దే తడి, పొడి చెత్తలను వేరు చేసి స్వీకరించాలని ఆదేశిస్తున్నా ఏమాత్రం అమలు కావడం లేదు. ఇప్పటికే బయోమైనింగ్ ద్వారా 80 శాతం చెత్తను వేరుచేసి వర్మికంపోస్టుతో పాటు ప్లాస్టిక్ కవర్లను వేరు చేశారు. కానీ చెత్తసేకరణలో క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కారణంగా తడి, పొడి చెత్తను కలిపి సిబ్బంది సేకరిస్తున్నారు. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. డంపింగ్‌యార్డులో ప్లాస్టిక్ కవర్లతో కూడిన చెత్తకుప్పలు గుట్టలుగుట్టలుగా దర్శనమిస్తున్నాయి.

చెత్తబుట్టలను అడుగుతున్నారు

తడి, పొడి చెత్త వేరు చేసే విధానంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది పని తీరును పరిశీలిస్తున్నాం. వేరు చేసి ఇవ్వాలని సూచిస్తే చెత్త డబ్బాలను అడుగుతున్నారు. గతంలో తడి, పొడి వేరుచేసి ఇవ్వడానికి చెత్త డబ్బాలను పాలకవర్గం అందజేసింది. అయినప్పటికీ తిరిగి అడుగుతున్నారు. ఈ విషయాన్ని పాలకవర్గం దృష్టికి తీసుకెళ్తాం.

- మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మెదక్



వేరు చేసిన ప్లాస్టిక్ కవర్ల కుప్పలు, డంపింగ్‌యార్డులో వేరు చేయకుండా వేసిన తడి, పొడి చెత్తకుప్పలు

'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● అధికారులకు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశం
● మెదక్ జిల్లాలో 82 అర్జీల స్వీకరణ.. తక్షణ పరిష్కారానికి చర్యలు

మెదక్ అర్బన్, జనవరి 8: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణిని నిర్వహిస్తున్నామని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజల నుంచి 82 అర్జీలను కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు స్వీకరించారు. ఇందులో భూ సమస్యలు, ఉద్యోగం, ఉపాధి తదితర ఫిర్యాదులకు సంబంధించినవి ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వీకరించిన దరఖాస్తులను వెంటనే సంబంధిత శాఖాధికారులకు అందజేసి పరిష్కరించాల్సిందిగా ఆదేశిస్తున్నామన్నారు. నిర్ణీత సమయంలోగా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఆర్వో పద్మశ్రీతోపాటు వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాయలంలో ప్రజావాణిలో భాగంగా దరఖాస్తులను స్వీరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు

సమస్యలను పరిష్కరించేందుకే 'ప్రజావాణి'

సంగారెడ్డి రూరల్, జనవరి 8: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో నగేష్‌గౌడ్‌లు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలను ఆయాశాఖల అధికారులు పరిశీలించిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే దానికి గల కారణాలను అర్జీదారులకు వివరంగా తెలపాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మనూర్ మండల కేంద్రానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని ఆ గ్రామ యువకులు అర్జీలో కోరారు. తమకు సంబంధించిన భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తమకు పింఛన్లు ఇప్పించాలని, ఉపాధి చూపాలని కోరుతూ మొత్తం 72 మంది అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించిన అదనపు కలెక్టర్ మాధురి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయాశాఖలకు సంబంధించిన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పరమేశ్వర్ పాల్గొన్నారు.


సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 8: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధికారులను అదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. కాగా ప్రజావాణికి భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం 24 దరఖాస్తులు వచ్చాయని ఆమె చెప్పారు. డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నారాయణఖేడ్, జనవరి 8: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందింది. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఏఐఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ యూనుస్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య ఇత్వార్‌పేటలోని సొంత ఇంట్లో ఉంటుంది. రెండో భార్య ఆసియాఅంజుమ్‌బేగం(35) పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో అద్దె ఇంట్లో ఉంటుంది. ఆసియా బేగంకు ఒక కుమార్తె ఉన్నది. సయ్యద్ యూనుస్ సోమవారం ఉదయం బయటకు వెళ్లాడు. రోజులాగే సాయంత్రం కూతురిని పాఠశాల నుంచి తీసుకొచ్చే ముందు అంజుమ్‌కు ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయలేదు. ఇంటికి వెళ్లి చూడగా వంట గదిలో అచేతనంగా పడి ఉన్నది. వెంటనే ఖేడ్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతిచెందిందని నిర్ధారించారు. స్థానిక డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి భర్తతో పాటు వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


వెంకటేష్(ఫైల్)

నారాయణఖేడ్, జనవరి 8: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. మండల పరిధిలోని తుర్కపల్లికి చెందిన దిడ్డి వెంకటేష్(30) నారాయణఖేడ్ పట్టణంలోని వెంకటేశ్వర షాపింగ్ మాల్‌లో పనిచేస్తాడు. రోజులాగే ఆదివారం విధులు ముగించుకుని తన వాహనంపై తుర్కపల్లికి వెళ్తున్నాడు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేష్ మృతదేహాన్ని నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నారాయణఖేడ్ ఎస్-2 శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి ఇరువురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ.47 వేల నగదు, 4 కార్లు, 2 బైకులు, 6 సెల్‌ఫోన్లు సీజ్

నాగల్‌గిద్ద, జనవరి 8: కర్ణాటక సరిహద్దులోని సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం చౌక్లానాయక్‌తండాలో పేకాట స్థావరంపై సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడిచేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. నాగల్‌గిద్ద ఎస్‌ఐ సిద్ధిరాములు తెలిపిన వివరాల ప్రకారం.. చౌక్లానాయక్‌తండాలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ బృందం దాడిచేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. కాగా వీరికి సంబంధించిన ఎర్టిగా, స్కోడా, ఇటోస్, షిఫ్ట్ కార్లతో పాటు హోండాషైన్, గ్లామర్ బైకులతో పాటు రూ.47,330 వేల నగదును సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేలిన మొబైల్, క్రషర్ కార్మికుడికి తీవ్రగాయాలు

తూప్రాన్, జనవరి 8: కంకర క్రషర్లలో పనిచేసే ఓ కార్మికుడి మొబైల్ ఫోన్ పేలిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఘనపూర్ శివారులోని శివం శంకరం స్టోన్ క్రషర్ కంకర మిషన్ వద్ద మహారాష్ట్రకు చెందిన సునీల్(35) బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తుంటాడు. సోమవారం రాత్రి మొబైల్ ఫోన్ పేలిపోవడంతో సునీల్ తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సునీల్ పొట్ట భాగం నుంచి పేగులు బయటపడ్డాయి. వెంటనే అతడిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. ప్రమాదంపై గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న తూప్రాన్ ఎస్‌ఐ శివానందం ప్రమాదస్థలానికి వెళ్తున్నట్లు తెలిపారు.

సంగారెడ్డిలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

● యూటర్న్ చేస్తుండగా ఢీకొన్న కార్లు ● సీసీటీవీల్లో దృశ్యాలు వైరల్


సీసీటీవీల్లో రికార్డైన ప్రమాద దృశ్యం

సంగారెడ్డి క్రైం, జనవరి 8: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత రెండు కార్లు ఢీకొన్నాయి. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి కరుణ స్కూల్ వద్ద రోడ్డు యూటర్న్ చేస్తున్నాడు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లికి చెందిన మరో వ్యక్తి తన కారులో పోతిరెడ్డిపల్లి చౌరస్తా వైపు వెళ్తూ యూటర్న్ చేస్తున్న కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. కాగా అర్ధరాత్రి సమయంలో రెండు కార్లు ఢీకొన్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

జాతీయ ఉపాధి హామీ పథకంపై ప్రజాదర్బార్

● పలు అవకతవకలు గుర్తింపు


మనూరులో నిర్వహించిన ప్రజాదర్బార్

మనూరు, జనవరి 8: మండల కేంద్రమైన మనూరులో 2022-23 సంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన రూ.మూడు కోట్ల 7లక్షల పనులపై ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు పీడీ వామన్‌రావు, జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, బోజిరెడ్డి హాజరయ్యారు. గ్రామాల్లో జరిగిన పనులపై విచారణ జరుపగా పలు అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. బోరంచలో చనిపోయిన వారిపేరుమీద పనిచేసినట్లు తేలింది. కూలీల సంతకాలు లేకుండానే బిల్లులు చేసినట్లు తెలిసింది. కొన్ని గ్రామాల్లో చేసిన పనులకు రికార్డులు సక్రమంగాలేవని అధికారులు తెలిపారు. ఈ విషయంపై జిల్లా అధికారులు అవకతవకలు జరిగిన గ్రామాల్లో ఫీల్డ్‌మెన్, టీఏలు, కార్యదర్శులకు నోటీసులు జారీచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి, ఎంపీడీవో షాజీలొద్దీన్, ఏపీవో షాహేద్ పాల్గొన్నారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోండి

● డీఆర్‌వోకు సీపీఎం నాయకుల వినతి


సంగారెడ్డి కలెక్టరేట్‌లో డీఆర్‌వో నగేష్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, జనవరి 8: జిల్లాలో పెరిగిపోతున్న కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌వో నగేష్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. జిల్లాలోని పటాన్‌చెరు, జిన్నారం, హత్నూర, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో పరిశ్రమల వల్ల చెరువులు, కుంటలు కలుషితమవుతున్నాయని ఆరోపించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పటాన్‌చెరు మండలం పాశమైలారం, జిన్నారం పారిశ్రామిక వాడల వల్ల పలు గ్రామాల్లో మంజీర నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య కారక పరిశ్రమల్లో తనిఖీలు చేయని పీసీబీ అధికారులపై కూడా చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఆయన కోరారు. పరిశ్రమల నుంచి కలుషిత వ్యర్థాలు ఇష్టారీతిని వెలువరించకుండా చూడాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, రాజయ్య, బాబురావు ఉన్నారు.

కోమటి కుంటలో అక్రమ కట్టడాల కూల్చివేత


బొల్లారం కోమటికుంటలో కట్టడాలు కూల్చివేస్తున్న అధికారులు

జిన్నారం, జనవరి 8: బొల్లారం మున్సిపాలిటీలో పలు అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కోమటికుంటలో నిర్మించిన కట్టడాలను సోమవారం ఆర్‌ఐ జయప్రకాష్, సర్వేయర్ రామభద్ర ఆధ్వర్యంలో కూల్చివేశారు. కోమటికుంటలో ఆక్రమణలు జరిపి, అక్రమంగా నిర్మాణాలు జరుపుతున్నారనే ఫిర్యాదులతో అక్కడకు చేరుకుని కూల్చివేశారు. కూల్చివేతల సమయంలో అధికారులు, ఎక్స్‌కవేటర్లపై కొందరు రాళ్లు రువ్వారు. స్థానిక నాయకుల ప్రమేయంతోనే ఈ కబ్జాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపించారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి: సీడీపీవో

చిన్నశంకరంపేట, జనవరి 8: బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో స్వరూప సూచించారు. సోమవారం చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి తండా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. పిల్లల ఎదుగుదల కోసం బాలింతలు, గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తినాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి, అంగన్వాడీ కార్యకర్త ఇందిరా, సరోజ, పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన

నాగల్‌గిద్ద, జనవరి 8: మండల పరిధిలోని కరస్‌గుత్తి గ్రామంలో సోమవారం సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వారీకార్ భజన బృందం ఆధ్వర్యంలో గ్రామంలో వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపి సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సచిన్‌పాటిల్, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాచ్ ఉమన్, హెడ్‌కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి, జనవరి 8: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నైట్ వాచ్ ఉమన్, హెడ్ కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పాఠశాల ఎస్‌ఓ ఫాతిమా సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆ పోస్టుల భర్తీకి నేటి నుంచి 18వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పదవ తరగతి మెమో, ఆధార్ కార్డు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని, హెడ్‌కుక్‌కు పెద్ద మొత్తంలో వంట చేసే అనుభవం తప్పనిసరిగా ఉండాలని ప్రకటనలో పేర్కొన్నారు.

నెల వ్యవధిలో హామీల అమలు

రామాయంపేట, జనవరి 8: నెల వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ప్రజల్లో మంచి నమ్మకం కలిగించిందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ప్రజాపాలన, మహిళల ఉచిత బస్ ప్రయాణం లాంటి హామీల అమలు ప్రజాప్రయోజనాలు చేకూర్చేలా ఉన్నాయన్నారు. ఆదివారం రాత్రి ఆయన పట్టణంలో పర్యటించారు. పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మైనంపల్లి విలేకరులతో మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే ఎమ్మెల్యే రోహిత్ దృష్టికి తేవాలని తెలిపారు. అలాగే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల సంఖ్యను త్వరలో పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట టీపీసీసీ ప్రతినిధి సుప్రభాతరావు, రమేష్‌రెడ్డి, అల్లాడి వెంకటి ఉన్నారు.

నేడు కల్హేర్ ఎంపీపీ సమావేశం

కల్హేర్, జనవరి 8: కల్హేర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షురాలు గుర్రపు సుశీల అంజయ్య అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రేగోడు, జనవరి 8: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం రేగోడు తహసీల్దార్ కార్యాలయం వద్ద జడ్పీటీసీ యాదగిరి, ఎంపీపీ సరోజన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలలక్ష్మి, ఆర్‌ఐ ఫిరోజ్, వైస్ ఎంపీపీ వినిల, కో ఆప్షన్ సభ్యుడు చోటుమియా, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగిరెడ్డి, ఎంపీటీసీ నర్సింహులు, సర్పంచులు సునిల్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

చేగుంట, జనవరి 8: బడి ఈడు పిల్లలు బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి బాధ్యత అని కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. చేగుంట మండలంలోని చిన్న శివనూర్ ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

అధికారులు ఇబ్బంది పెట్టడం తగునా?

నర్సాపూర్, జనవరి 8: గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, అధికారులు సూచన మేరకే ముక్కిన, తడిసిన ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశానని, వాటిని ఇప్పుడు అధికారులు తీసుకోకుండా ఇబ్బంది పెడుతూ ఆర్‌ఆర్ యాక్టు కింద తన ఆస్తులు జప్తు చేయడం ఎంతవరకు సమంజసమని రైసుమిల్లు వ్యాపారి పైడి శ్రీధర్‌గుప్తా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని కాగజ్‌మద్దూర్‌లో పలువురు రైతులతో కలిసి తనకు న్యాయం చేయాలంటూ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు పరిశీలన


రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న ఆర్డీవో

రేగోడు జనవరి 8: ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో మెదక్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ సోమవారం పరిశీలించారు. డేటా ఎంట్రీ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అంతకుముందు రేగోడు తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ బాలలక్ష్మి, ఆర్‌ఐ ఫిరోజ్, ఆపరేటర్ శ్రీధర్, వంశీ ఉన్నారు.

హుండీ పగులగొట్టి, నగదు అపహరణ

రామాయంపేట, జనవరి 8: పట్టణంలోని మల్లన్న, ఎల్లమ్మ ఆలయాల్లో హుండీలను ధ్వంసం చేసి, నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి దుండగులు రెండు హుండీలను పగులగొట్టి భక్తులు వేసిన నగదును దోచుకెళ్లారు. సోమవారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లిన ఆలయ కమిటీ సభ్యులు విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీల్లో దాదాపు రూ.50,000 వేలకుపైగా నగదు ఉంటుందని, చోరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిషనరీస్ సొసైటీ కన్వీనర్‌గా మహేష్


హైదరాబాద్‌లో మహేష్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

జిన్నారం, జనవరి 8: సంగారెడ్డి జిల్లా ఫిషనరీస్ సొసైటీ కన్వీనర్‌గా ఊట్ల గ్రామానికి చెందిన మహేష్ నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఫిసనరీస్ సొసైటీ స్థాపన కార్యక్రమంలో జిల్లా కన్వీనర్‌గా మహేష్‌ను నియమించారు. వ్యవస్థాపకుడు పిట్టల రవీందర్, విజయాగుప్తా నియామకపత్రాన్ని అందజేశారు.

అటవీ భూమి కబ్జాకు యత్నం

కౌడిపల్లి, జనవరి 8: మండల పరిధిలోని నాగ్సన్‌పల్లిలో కొందరు వ్యక్తులు తమ పట్టా భూమిని ఆనుకుని ఉన్న అటవీ భూమి కబ్జాకు యత్నిస్తున్నారు. అటవీ భూమిలోని కంచెను తొలగించగా విషయం తెలుసుకున్న సర్పంచ్ అల్మాయిపేట ఎల్లం, ఉపసర్పంచ్ నరహరి, గ్రామస్థులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్ సోమవారం అటవీ ప్రాంతాన్ని గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. కబ్జా జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని డీఎఫ్‌వో ముందే రేంజ్ అధికారి అంబర్‌సింగ్‌ను నిలదీశారు. వారం రోజులుగా అటవీ భూమిలోని చెట్లను నరికివేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చెట్లను నరికిన వారిపై పూర్తి స్థాయి విచారణ చేసి చర్యలు చేపడుతామని డీఎఫ్‌వో పేర్కొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన నాయకులు

సంగారెడ్డి రూరల్, జనవరి 8: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను సోమవారం బీఆర్‌ఎస్‌వీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అధికారం లేదని బాధపడవద్దని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని సూచించినట్లు బీఆర్‌ఎస్‌వి జిల్లా నాయకుడు అఖిల్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు అఖిల్, రఘు తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్


మంతూరులో నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా, రాష్ట్ర నాయకులు

నర్సాపూర్, జనవరి 8: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తూ ప్రజల అభిమానం చూరగొంటున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మంతూరులో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గ్రామంలో స్లైడ్ షో ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పథకాలు అందని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాజయ్యయాదవ్, జిల్లా కార్యదర్శి సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాజేందర్, మాజీ ఎంపీపీ రమణరావు, పార్టీ మండలాధ్యక్షుడు నగేష్, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌గుప్తా, దేవేందర్‌యాదవ్, నగేష్‌గౌడ్, ఆంజనేయులు, చంద్రయ్య, మాణియ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

● పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
● రోడ్డు విస్తరణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే


పటాన్‌చెరులో జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 8: మదీనగూడా, లింగంపల్లి మీదుగా పటాన్‌చెరు ముత్తంగి జాతీయ రహదారి విస్తరణ నేపథ్యంలో అధికారులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పలు ప్రాంతాలను పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సుమారు రూ.1,200ల కోట్లతో రహదారి విస్తరణ త్వరలో ప్రారంభం కాబోతున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు పట్టణం, ముత్తంగి గ్రామంలో రహదారి విస్తరణ కోసం భూ సేకరణ, హైవే బ్రిడ్జిల నిర్మాణాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, ముత్తంగి సర్పంచ్ ఉపేందర్ ఉన్నారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని పోచారం గ్రామంలో మల్లన్న జాతరలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, పాల్గొన్నారు.

గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



పెద్దశంకరంపేట, జంగరాయిలో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

పెద్దశంకరంపేట, జనవరి 8: మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలోని మాధవనగర్ కాలనీ గాంధీ చౌక్‌కాలనీలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఆర్యవైశ సంఘం యూత్ అధ్యక్షుడు కందుకూరి రవీందర్ చేతులమీదుగా సోమవారం ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. అక్షింతలతో పాటు భవ్యరామమందిరం నిర్మాణ చిత్రపటం, కరపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీలు వీణసుభాష్‌గౌడ్, బొండ్ల దత్తు, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర సభ్యులు సీతారామారావు, సతీష్‌గౌడ్, దాదిగారి గంగాధర్, సర్వేశ్వర్, అన్నారం మురళీ, చకిలం సంతోష్‌కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

●చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు జంగరాయి గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాగారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీశైలం, రాజు, సుధీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్చింగ్ విధానంలో పంటలసాగుతో ప్రయోజనం


జహీరాబాద్ మండలం రంజోల్‌లో మల్చింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న ఏఈవో ప్రదీప్


నిజాంపేట మండలం నస్కల్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ వసంతసుగుణ

● వ్యవసాశాఖ ఏఈవో ప్రదీప్

జహీరాబాద్, జనవరి 8: మల్చింగ్ విధానంలో పంటలు సాగు చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాశాఖ ఏఈవో ప్రదీప్ పేర్కొన్నారు. సోమవారం రంజోల్ గ్రామంలో మల్చింగ్ విధానంతో వాటర్‌మిలాన్ మొక్కలను నాటే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విధానంలో పంటల సాగుకు రైతులు ఆసక్తిని కనబరుస్తున్నారని చెప్పారు. మల్చింగ్ విధానం ద్వారా కలుపు మొక్కల నివారణతో పాటు, భూమిలో తేమశాతం ఎక్కువగా ఉంటుందన్నారు. కూరగాయలు, వాటర్‌మిలాన్, పచ్చిమిర్చి తదితరాలకు ఈ విధానం ఉపయోగించుకోవచ్చొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంట పొలాలను సందర్శించిన ఏడీఏ

నిజాంపేట: మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఏడీఏ వసంత సుగుణ సోమవారం రైతుల పంట పొలాలను పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున ఏమమెక్షన్ బెంజోయేట్ 80 గ్రాముల ద్రావణాన్ని ఎకరం పంటకు పిచికారి చేసుకోవాలని ఆమె సూచించారు. ఆమెవెంట ఏఈవో కావేరి ఉన్నారు.

గుంతలమయంగా చిన్నశంకరంపేట-జంగరాయి రోడ్డు

● పనులను మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్


గుంతలతో దర్శనమిస్తున్న జంగరాయి రోడ్డు

చిన్నశంకరంపేట, జనవరి 8: చిన్నశంకరంపేట మండల కేంద్రం నుంచి జంగరాయికి నాలుగు కిలోమీటర్ల మేర తారు రోడ్డు 13 సంవత్సరాల నుంచి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంతో దర్శనమిస్తున్నది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మూడు సంవత్సరాల క్రితం రోడ్డు మరమ్మత్తుల కోసం రూ.90 లక్షలు మంజూరు చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డును మధ్య మధ్యలో తవ్వి వదిలేశాడు. పనులు పూర్తి చేయాలని జంగరాయి, చందాపూర్, మలుపల్లి గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

అన్నాతమ్ముళ్ల అదృశ్యం


యశ్వంత్, దేవిశ్రీపసాద్

జిన్నారం, జనవరి 8: బొల్లారం మున్సిపాలిటీలో ఆడుకోవటానికి ఇంటి నుంచి వెళ్లిన ఇద్దరు అన్నాతమ్ముళ్లు అదృశ్యమైనట్లు సీఐ నయీమొద్దీన్ తెలిపారు. బొల్లారం సంతోష్‌నగర్‌కు చెందిన మద్ది యశ్వంత్, మద్ది దేవిశ్రీప్రసాద్ ఇద్దరు అన్నాతమ్ముళ్లు. వీరు డిసెంబరు 29న ఆడుకోవడానికని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు వెతికినా జాడ దొరకలేదు. సోమవారం తల్లి ప్రమీలారాణి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ నయీమొద్దీన్ తెలిపారు.

పన్ను చెల్లింపులో అపోహలు వద్దు

● రాష్ట్ర ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయ అధికారి మానస్ నిరంజన్


సదస్సులో మాట్లాడుతున్న మానస్ నిరంజన్

మెదక్ అర్బన్, జనవరి 8: ఆదాయపు పన్ను చెల్లింపుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయ అధికారి మానస్ నిరంజన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లాలోని డీటీఓలకు, ప్రభుత్వ అకౌంటెంట్లకు టీడీఎస్ పత్రాలు ఆన్‌లైన్‌లో సమర్పించే విధానంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు తప్పనిసరిగా ప్రతినెలా టీడీఎస్ కట్టించడంతోపాటు ప్రతి ఉద్యోగికి సంబంధించి ఐటీ రిటర్న్ చేయడం, తదితర అంశాలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జీతంలో నుంచి ఐటీ డిడక్షన్, టీడీఎస్ చెల్లింపు వాటిపై సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఖజానాధికారి చిన్న సాయిలు, జిల్లాలోని వివిధ డీడీవీ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాసాయిపేట, జనవరి 8: మెదక్ జిల్లా పాపన్నపేట మండలం బాచారం గ్రామంలో దళిత యువకుడు రవీందర్‌పై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మాట్లాడారు. బాచారం గ్రామానికి చెందిన పోలీసు లక్ష్మణ్, పోలీసు రాజు, శంకరప్ప అనే ముగ్గురు వ్యక్తులు దళిత యువకుడిపై అకారణంగా దాడి చేసి గాయపరిచారని, దాడి చేసిన ముగ్గురిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి, చెట్లపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.

జిల్లా కబడ్డీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

పటాన్‌చెరు, జనవరి 8: సంగారెడ్డి జిల్లా కబడ్డీ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం పటాన్‌చెరులో ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా జానిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనంత్‌రెడ్డి, చైర్మన్‌గా ఎల్లయ్య కోశాధికారిగా సుభాష్, కార్యనిర్వహణ కార్యదర్శిగా శివలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో కబడ్డీ జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.

పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ


తూప్రాన్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంఈవో, ఉపాధ్యాయులు

తూప్రాన్, జనవరి 8: తూప్రాన్ పట్టణ బాలుర ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్‌ను మండల విద్యాధికారి బుచ్చానాయక్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పర్వతి సత్యనారాయణ, పీఆర్టీయూ టీఎస్ మండలాధ్యక్షుడు గంగాల రమేష్, ప్రధాన కార్యదర్శి సంగిడి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హనుమంతరావు, బాగారెడ్డి, శ్రీనివాస్‌రావు, భూపతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, మాజీ మండలాధ్యక్షుడు శివకుమార్, ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, వేణుగోపాల్‌గౌడ్, యేహేస్, ప్రభాకర్, చంద్రారావు, వేణు, లత, సంఘమేశ్వర్, ప్రభావతి, శైలజా, జ్యోతి, మన్సూర్ అలీ, వెంకటేశం పాల్గొన్నారు.

● మాసాయిపేట: మండల కేంద్రమైన మాసాయిపేటలోని ఉన్నత పాఠశాలలో సోమవారం పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈవో యాదగిరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు హరిరంజాన్‌శర్మ, నవీన్, ముంతాజ్ అలీ, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎల్గొన్నారు.

ఎస్‌జీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

చిన్నశంకరంపేట, జనవరి 8: మండలంలోని సూరారం ప్రాథమిక పాఠశాలలో గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఉపాధ్యాయులు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీసాయిరెడ్డి, ఎస్‌జీటీయూ మండలాధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ప్రవీణ్, శికృష్ణ, రవి, సురేష్, సంతోష్, మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


సూరారంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు